క్లుప్తంగా

పంట వివరాలు నమోదు చేయించుకోవాలి

కోడేరు: మండలంలోని ప్రతి రైతు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. సర్వే నంబర్ల ప్రకారం ఏఏ పంటలు సాగు చేశారో వాటి వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కోడేరు: మండలంలోని బాడిగదిన్నెలో ఇందిరమ్మ ఇళ్లకు హౌసింగ్ ఏఈ నాగరాజు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. విడతల వారీగా ఖాతాలో నిధులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలత, బైరపోగు వెంకటస్వామి, చిన్నకుర్మయ్య, ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

అమ్రాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అమ్రాబాద్, పదర మండల కేంద్రాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల మండల స్థాయి సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



మన్ననూర్: స్థానికంగా బీఆర్‌ఎస్‌లో క్రియాశీలంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి మంగళవారం దిండిలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో చేరారు. మొత్తంగా 30 మంది కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. త్వరలోనే జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

విద్యార్థులకు గోల్డ్ మెడల్



తాడూరు: కరీంనగర్ జిల్లా కేంద్రంలో 8, 9 తేదీల్లో నిర్వహించిన 3వ రాష్ట్ర స్థాయి కుంగుపూ కరాటే పోటీలలో తాడూరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ ఎర్రోళ్ల వెంకటస్వామి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదువుతున్న చంద్రశేఖర్ అండర్ 14 క్యాటగిరి స్పారింగ్‌లో గోల్డ్‌మెడల్, కరాటే విభాగంలో శరత్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. మాస్టర్ వెంకటస్వామి, పాఠశాల హెచ్‌ఎం అనిల్‌కుమార్ రెడ్డిలు వారిని అభినందించారు.

రేషన్‌కార్డు దారుల హర్షం

దోమలపెంట: బ్రహ్మగిరి గ్రామంలో కొత్త రేషన్ కార్డుదారులు మంగళవారం రేషన్ షాపులో సన్న బియ్యం తీసుకుని ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు 10 ఏళ్ల తర్వాత 125 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరుకాగా దుకాణాల్లో సన్న బియ్యం తీసుకొని సంబురపడ్డారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ బి.మల్లికార్జున, బూదాల ప్రసాద్, సిరాజ్, రేషన్ డీలర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న విషజ్వరాలు

కొల్లాపూర్: వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరం, దగ్గు, జలుబు, వాంతులతో పట్టణ ప్రజలు బాధపడుతున్నారు. జ్వర బాధితులతో ప్రభుత్వ ఆస్పత్రి కొన్ని రోజులుగా కిక్కిరిసిపోతోంది. సాధారణ రోజుల్లో 300 మంది వరకు ఓపీ ఉంటుండగా జ్వరాల కారణంగా ఓపీ 400 వరకు ఓపీ చూస్తున్నారు. రోజూ 90 మందికి పైగా ఇన్‌పేషెంట్ సేవలు పొందుతున్నారు. జ్వరాలు, దగ్గు, జలుబుతో చాలా మంది ఆస్పత్రికి వస్తున్నారని, ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు.

మద్యానికి బానిస కావొద్దు

కల్వకుర్తి రూరల్: యువత మద్యానికి బానిస కావొద్దని స్వామి వివేకానంద సేవ బృందం అధ్యక్షుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ కోరారు. మంగళవారం మండలంలోని తోటపల్లిలో ఏఐజీ ఆస్పత్రి సహకారంతో ఉచిత లివర్ పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది గ్రామస్తులకు లివర్ స్కానింగ్, రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్యులు రోహిత్‌కుమార్, దేవి ప్రసన్న, కీర్తి, మానస, వైభవ్ , దుర్గాప్రసాద్, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన

సాక్షి, నెట్‌వర్క్: వరి పంటకు పొట్ట దశకు వస్తున్న సమయంలో కూడా ప్రభుత్వం యూరియా అందించడం లేదని రైతులు జిల్లావ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో పంటకు యూరియా వేయకపోతే మొక్క ఎదుగుదల సరిగా ఉండదని, దాని ప్రభావం దిగుబడిపై పడుతుందని వాపోతున్నారు. రోజుల తరబడి భార్య, పిల్లలతో సింగిల్‌విండో కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నా రెండు బస్తాల యూరియా కూడా దొరకని దుస్థితి ఏర్పడిందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు రోడ్లపై రాస్తారోకో చేస్తున్నారు.



తిమ్మాజిపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

■ కల్వకుర్తి పీఏసీఎస్ వద్ద మంగళవారం తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ లైన్లలో నిల్చున్నారు. ఈ క్రమంలో అధికారులు రైతుల నుంచి పత్రాల జిరాక్స్‌లు తీసుకొని టోకెన్లు అందించారు. 280 బస్తాల యూరియా వచ్చిందని, ఎకరా పొలం ఉన్నవారికి ఒక బస్తా, అంతకంటే ఎక్కువ పొలం ఉన్న రైతులకు రెండు బస్తాల యూరియా అందించినట్లు సీఈవో వెంకటరెడ్డి చెప్పారు.

■ తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. వారం రోజులుగా తిరుగుతున్నా ఒక్క యూరియా బస్తా ఇవ్వడం లేదని వాపోయారు. ఈ క్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఈఓలు టోకెన్లు ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

■ వెల్దండ మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద పోలీసులు బందోబస్తు మధ్య రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు.

■ అచ్చంపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు సర్దిచెప్పారు.



కల్వకుర్తి పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆందోళన

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని డీటీఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు మడుపు నాగేష్, జిల్లా ఇన్‌చార్జ్ కల్యాణ్, మాజీ రాష్ట్ర ఈసీ మెంబర్ పృథ్వీరాజ్‌లు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రవాణా కార్యాలయం పూర్తిగా అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. ఎలాంటి అర్హతలు లేకున్నా డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం రవాణాశాఖ కార్యాలయం ఏఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధు, మోఘులాల్, నాగరాజు, బాలరాజు, శేషు, జనార్దన్, అఖిల్, రామకృష్ణ,, రాంచందర్ పాల్గొన్నారు.

వసతి ఏర్పాటులో ప్రత్యేక శ్రద్ధ

చారకొండ: ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్సీ వసతి గృహం వార్డెన్ బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. వసతి గృహంలో సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహం సిబ్బంది, వర్కర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

లంబాడీల జోలికొస్తే ఊరుకోం

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో ఉన్న 32 గిరిజన తెగలను విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తే చూస్తూ ఊరుకోమని లంబాడా సంఘం నాయకులు కొర్ర ఈశ్వర్‌లాల్, మంగ్యానాయక్, భరత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బంజారా లంబాడీలు ఎస్టీలు కాదని మాజీ ప్రజాప్రతినిధులు సోయం బాపూరావు, తెల్లం వెంకటరావు సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టులో కేసు వేసిన నాయకులు తక్షణమే బహిరంగంగా లంబాడీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దగ్గు, లచ్చునాయక్, తిరుపతి, శ్రీనునాయక్, తులసీరాం పాల్గొన్నారు.

దళారులతో పోల్చడం సరికాదు

నాగర్‌కర్నూల్: బిల్డింగ్ ప్లానర్స్‌ను దళారులతో పోల్చడం సరికాదని బిల్డింగ్ ప్లానర్స్ అసోసియేషన్, ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఖండించారు. మధ్యవర్తులు, దళారులు చట్టబద్ధమైన అధికారమూ లేకుండా, స్వలాభం కోసం అనధికారికంగా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యక్తుల గురించి ఇచ్చిన ప్రకటనలో బిల్డింగ్ ప్లానర్స్‌ను కూడా చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ని కలిసి పత్రికలలో వచ్చిన ప్రకటనను గురించి చర్చించారు. మున్సిపల్ ఎల్టీపీ, ఇంజనీర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, కార్యదర్శి షేక్ సమీ, సీనియర్ సలహాదారులు శివానంద్, సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కల్వకుర్తి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ బీ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. హాస్టల్ పరిసరాలతో పాటు, వంటగది, స్నానాల గదులు, ఇతర పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థుల బాగా చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. హాస్టల్ వార్డెన్ రవికుమార్, తదితరులు ఉన్నారు.

కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా మండికారి బాలాజీ

అచ్చంపేట: కళావేదిక జిల్లా అధ్యక్షుడిగా నల్లమలకు చెందిన ప్రముఖ కవి, చిత్రకారులు, సామాజిక కార్యకర్త మండికారి బాలాజీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ ప్రతాప్ కౌటిల్య, ఉపాధ్యక్షుడిగా రాచమల్ల మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా మంద సురేఖ, మహిళా కార్యదర్శిగా గుంటి గోపిలత, కార్యదర్శిగా వల్లూరి శివాచారి, కార్యదర్శి కొమ్ముగోని శ్రీనయ్య గౌడ్, కోశాధికారి కోడెల బక్కయ్య యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆవంచ శేఖర్, ప్రచార కార్యదర్శిగా కోలౌటి భీమాచారి, గౌరవ సలహాదారు మల్లెకేడి రామోజీ, తిప్పర్తి అనిత, పోల సాయి జ్యోతిలు ఎంపికయ్యారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



కల్వకుర్తి రూరల్: పట్టణ సమీపంలోని కై లాసం గుట్టపై కరెంటు సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హిందూ ఐక్యవేదిక నాయకులు మున్సిపల్ కమిషనర్ మహబూబ్ షేక్ కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుట్టపై స్తంభాలు విద్యుత్ వైర్లు దెబ్బతిని సరఫరా నిలిచి పోయిందన్నారు. రాబోయే రోజుల్లో దసరా, దీపావళి, కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు గుట్టపై ఉన్న దేవాలయాలకు వచ్చే అవకాశం ఉందని వెంటనే సమస్యను పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో దయాకర్, మహేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రదీప్, వివేకానంద, ప్రవీణ్ రెడ్డి, నరేష్ గౌడ్, శ్రీశైలం యాదవ్, ఆంజనేయులు, చందు, రఘు యాదవ్, వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



పెద్దకొత్తపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పరశురామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ నాగేందర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా కార్యదర్శులు, ఎంపీడీఓ పట్టించుకోవడంలేదని విమర్శించారు. అనంతరం ఎంపీడీఓ స్పందించి ధర్నా వద్దకు బీజేపీ కార్యకర్తలతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. దీంతో బీజేపీ నాయకులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌యాదవ్, శివ, బీమేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రావు, శివుడు, మేకల శివ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పోటీల్లో శాంతినికేతన్ పాఠశాల విద్యార్థిని శ్రీవాణి ప్రథమ స్థానం, సిద్దార్థ మోడల్ పాఠశాలకు చెందిన ఏ ప్రశాంతి మండల స్థాయిలో రెండో బహుమతి సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌గౌడ్, దీప సెబాస్టియన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలలో విద్యార్థులను వారు అభినందించారు.

పకడ్బందీగా క్రీడలు నిర్వహించాలి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో 69వ ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి ఆటలపోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ ఇమ్మాన్యుయెల్ సూచించారు. 16న నిర్వహించే క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి మంగళవారం ఉపాధ్యాయులతో ఆయన సమావేశం అయ్యారు. బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని పోటీలకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఎంఈఓను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కురుమయ్య, నాగరాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని నిరసన

తాడూరు: మండలంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేల ఆధారంగా ఉన్న పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, వెంకటస్వామి, ఆంజనేయులు, కృష్ణయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణకు మొబైల్ ఎక్స్‌రే

మన్ననూర్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్‌రే యంత్రం సహాయంతో మంగళవారం టీబీ వ్యాధిగ్రస్తులకు టీబీ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 116 ఎక్స్‌రేలు తీయగా 26 మందిని టీబీ లక్షణాలు కన్పించగా వారిని ఎస్‌ఏటీ పరీక్షల కోసం పంపించారు. సరైన వైద్యం చేయించుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుధాకర్, గౌతమ్, టీబీ సూపర్‌వైజర్ ఆరీఫ్‌ఖాన్, వైద్య సిబ్బంది మార్తమ్మ, భవితేజ, శైలజ, గోవయ్య, బాలకిష్టమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన ఐటీడీఏ పాఠశాల



మూతపడిన శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాల



అప్పాయపల్లి పాఠశాలకు వెళ్లి వస్తున్న విద్యార్థులు

లింగాల: మండలంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. పాఠశాలలు మూతబడుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. మండలంలోని శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాల ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి మూసి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ గత ఏడాది పని చేసిన ఉపాధ్యాయురాలు బదిలీపై వెళ్లగా మరొకరిని నియమించ లేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో దాదాపుగా 20 మంది గిరిజన, ఇతర వర్గాల విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న అప్పాయపల్లికి పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. పాఠశాల మూతపడినా సంబంధిత ఐటీడీఏ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని, ఇటు వైపు కూడా రాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మా పరిధిలో లేదు

మండలంలోని శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాల మండల విద్యాశాఖ పరిధిలోకి రాదు. ఐటీడీఏ నిర్వహణలో కొనసాగుతోంది. కేవలం మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం మాత్రమే సరఫరా చేస్తాం.

– బషీర్ అహ్మద్, ఎంఈఓ

శ్వేత వర్ధంతికి బీఆర్‌ఎస్ నాయకుల హాజరు

జడ్చర్ల/తిమ్మాజిపేట: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేతారెడ్డి సేవలు చిరస్మరణీయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మంగళవారం శ్వేత ప్రథమ వర్ధంతి సందర్భంగా తిమ్మాజిపేట మండలం ఆవంచలో ఏర్పాటు చేసిన శ్వేత విగ్రహాన్ని కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు హాజరై ఆవిష్కరించారు. అనంతరం జడ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో శ్వేత చిత్రపటం పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అంతకుముందు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సతీమణి శ్వేత చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం



నాగర్‌కర్నూల్‌లో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో..



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గీతాంజలి



ఎల్లూరు ఉన్నత పాఠశాలలో..

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఐడీవోసీ కార్యాలయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ 111వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడారు. కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది అనే నినాదంతో ఆయన దేశ ప్రజలకు ప్రేరణ నిచ్చారని కొనియాడారు. అదేవిధంగా పలు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్వకుర్తికొల్లాపూర్, తెలకపల్లి, వెల్దండ, బిజినేపల్లి, కోడేరు, బల్మూర్, ఉప్పునుంతల, అమ్రాబాద్, లింగాల, అచ్చంపేట మండలాల్లో తెలంగాణ భాషా దినోత్సవం న్విహించారు.

నంబర్ ప్లేట్ తప్పనిసరి

వెల్దండ: వాహనాలకు తప్పనిసరిగా నంబర్‌ప్లేట్ తీసుకోవాలని ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలను ఎస్‌ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ వాహనాలను గుర్తించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సామూహిక వివాహాలు పేదలకు వరం

అచ్చంపేట రూరల్: సామూహిక వివాహాలు పేదలకు వరం లాంటివని కౌన్సిలర్ అప్పశివ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచనల మేరకు నవంబర్ 16న అచ్చంపేటలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న అప్పశివ జ్యూవెల్లర్స్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. బంగారు పుస్తె, వెండి మెట్టెలతో పాటు వధూవరులకు దుస్తులు, బీరువా, ఇతర గృహోపకార వస్తువులు అందిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 76610 08966ను సంప్రదించాలని కోరారు.

ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గెల్వయ్య

వంగూరు: మండల కేంద్రంలో గెల్వలాంబమాత యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గెల్వయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా సుమన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరువురిని ఎన్నుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

లింగాల: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలు అజయ్, శివప్రసాద్, అరవింద్, పర్వతాలు, కొండయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, ప్రభాకర్‌రావు, పాండుగౌడు, సుశీలమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గం



కల్వకుర్తిటౌన్: మేడ్చల్ జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది సురేష్‌బాబుపై రౌడీమూకలు దాడి చేయడం దుర్మార్గ చర్య అని కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం న్యాయవాదిపై దాడి చేయడం నిరసిస్తూ కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం చేరుకొని ఆర్డీఓ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఏజీపీలు వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌రాజ్, న్యాయవాదులు చిందం కృష్ణయ్య, భాస్కర్‌రెడ్డి, అమరేందర్, జమీల్ అహ్మద్, రాంగోపాలు, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, జంగయ్య, మల్లేష్, ప్రశాంత్, శ్రీను ఉన్నారు.

నర్సరీలను పరిశీలించిన డీఆర్‌డీఓ



వంగూరు: మండలంలోని సర్వారెడ్డిపల్లి, కోనేటిపూర్ పరిధిలో ఉన్న నర్సరీలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చిన్న ఓబులేషు పరిశీలించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీలను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నర్సరీల్లో నాణ్యమైన మొక్కలను పెంచాలని నర్సరీల ఏర్పాటు నిరంతర ప్రక్రియ అని అన్నారు. నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆయన వెంట ఏపీఓ శివశంకర్‌గౌడ్, టీఏ గణేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మచారిలు ఉన్నారు.

సాగు చేసేందుకు అనుమతి ఇవ్వాలి



అమ్రాబాద్: పదర మండలం కండ్లకుంట భూమిని సాగు చేసేందుకు అనుమతించాలని మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి చెంచులు మంగళవారం అమ్రాబాద్‌లో ఎఫ్‌ఆర్‌ఓ రేంజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా భూములను నమ్ముకొని జీవిస్తున్నామని ప్రస్తుతం సాగుచేయకుండా అడ్డుకుంటే ఎలా బతుకుతామని వాపోయారు. చెంచు సేవా సంఘం నాయకులు నాగయ్య, బాలయ్య, లింగయ్య తదితరులు ఉన్నారు.

ఎంజీకేఎల్‌ఐ అతిథి గృహంలో చోరీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని జొన్నలబొగుడ గ్రామ శివారులోని మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టపై నిర్మించిన కేఎల్‌ఐ అతిథి గృహంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సామాగ్రిని అపహరించినట్లు జొన్నలబొగుడ మాజీ ప్రజాప్రతినిధులు ధరేందర్, భద్యానాయక్‌లు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సతీష్, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు, మాజీ ప్రజాప్రతినిధులు అతిథి గృహానికి వెళ్లి పరిశీలించారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు సత్యం, చిన్నయ్య, కొండల్‌రావు, రవికుమార్, కొండలయ్య, బాలస్వామి, గోపాల్‌రావు, మెరుగు రాజు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వైర్ల చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సిలార్‌పల్లి వార్డులో ఉన్న కేఎల్‌ఐ కాల్వలో ఉన్న విద్యుత్ మోటార్ల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన గోకుల్‌రెడ్డితో పాటుగా చుట్టుపక్కల ఉన్న పొలాల్లో మోటార్ల వైర్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.